Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143




Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 134 | Sunday 27.04.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 134 | ఆదివారం 27. 04. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4


## దాడి చేసిన వారిని... వదిలేది లేదు : అర్చకులు రంగరాజన్



హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** తనపై దాడి చేసిన వారిని వదిలేది లేదని, చట్టపరంగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ స్పష్టం చేశారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 7న పలువురు తమ ఇంటికి వచ్చి తలుపులు తట్టారని.. ఆ సమయంలో తాను స్నానం చేయనుందునే టీషర్టులో ఉన్నానని.. ఇప్పుడు ఎవరినీ కలవలేనని చెప్పానన్నారు. వారిలో నల్ల బట్టలు ధరించిన ఒక వ్యక్తి.. రామరాజ్యం కోసం పనిచేసే వారిని కలవడానికి మీకు సమయం లేదా? అంటూ

మిగతా 2 లో

## తిరుమలలో మళ్లీ... చిరుత సంచారం.. భయాందోళనలో భక్తులు



తిరుమల, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** తిరుమలలో మళ్లీ చిరుత సంచారం కలవరపెడుతున్నది. జూ పార్క్ రోడ్డు నుంచి తిరుమల టోల్ గేటు మీదుగా చిరుత అటవీ ప్రాంతంలోకి వెళ్తూ కనిపించింది. చిరుత సంచారం గమనించిన సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందజ శారు. ఇటీవల తిరుమలలో చిరుత సంచారం ఎక్కువైంది. రెండు వారాల కిందట కూడా చిరుత సంచరిస్తున్నట్లుగా వార్తలు వచ్చాయి. దీంతో అలిపిరి నుంచి తిరుమలకు కాలినడకన వచ్చే శ్రీవారి భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ క్రమంలో భక్తుల రక్షణ కోసం టీటీడీ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. అలాగే చిరుతను పట్టుకునేందుకు తిరుపతి వేదిక్

మిగతా 2 లో

## మీ సమస్యలను తెలుసుకునేందుకు...

# నేరుగా వచ్చా...

శ్రీకాకుళం, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** జిల్లా పర్యటనలో భాగంగా 'మత్స్యకారుల సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. టీడీపీకి వెనుకబడిన వర్గాలే వెన్నెముక అని అన్నారు. స్థానికుల సమస్యలు, పేదల కష్టాలు చూశానని.. కొందరు జాలర్ల ఆదాయం కూడా కాజేస్తున్నారని తెలిపారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందులున్నా మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గత ఎన్నికల్లో వెనకబడిన వర్గాలన్నీ కూటమికి అండగా నిలిచాయని.. వెనుకబడిన వర్గాల కోసం మరిన్ని కార్యక్రమాలు తీసుకొస్తామని సీఎం వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో రూ.10 లక్షల కోట్ల అప్పులు చేశారని.. వైసీపీ హయాంలో తీసుకొచ్చిన రుణాలు ఏం చేశారో కూడా లెక్కలు లేవని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే జాలర్ల దశదిశ మారిందన్నారు. వేట విరామ సమయంలో జాలర్లకు ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున సాయం అందిస్తున్నామని తెలిపారు. పథకం కింద 1,29,178 కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరుతోందని చెప్పారు. 'గత నాయకుల మాదిరిగా మేము కూడా బటన్ నొక్కొచ్చు కానీ.. నేరుగా మీ దగ్గరికే వచ్చాం.. మీ సమస్యలు తెలుసుకున్నాం. మీ కష్టాలు తెలుసుకుని నేరుగా పథకాలు అందిస్తున్నాం' అని తెలిపారు. అన్ని మత్స్యకార గ్రామాలను బాగుచేస్తామని తెలిపారు. ప్రభుత్వం బాధ్యతగా ఉండాలని.. ప్రజల ఆదాయం పెంచాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను ప్రభుత్వం మెరుగుపరిచాలన్నారు. గతంలో నేతలు వస్తే చెట్టు నరికేయడం.. పరదాలు కట్టడం జరిగేవని విమర్శించారు. గతంలో ఉద్దానం ప్రాంతానికి ఎర్రన్నాయుడు నీళ్లు సాధించారని గుర్తుచేశారు. ఇప్పుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తికాబోతోందన్నారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు రావాలన్నారు. 9 షిప్పింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నామని..ఏడాదిలోగా షిప్పింగ్ హార్బర్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్య సంపదలో ఏపీ నుంచే 29% అని చెప్పుకొచ్చారు. మత్స్యకారుల పిల్లలను బాగా చదివించే బాధ్యత తీసుకుంటామన్నారు. ఇప్పటికే 6 రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేశామని..అవకాశాలను ఉపయోగించుకుని ముందుకు సాగాలని అన్నారు. ఎచ్చెర్లలో నైపుణ్య శిక్షణ కేంద్రం ర్పాటు చేస్తామని తెలిపారు. స్థానికులకే ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

**ఏం తక్కువ మన జిల్లాకు: రామ్మోహన్ :**

'మా కంటే చిన్న వయస్సులో ఉన్నవారిలా చంద్రబాబు అహర్నిశలు పనిచేస్తున్నారు. వేట నిషేధ భృతి పెంచుతానని హామీ ఇచ్చి మాట నిలబెట్టుకున్నారు. జీవో 217 కూడా రద్దు చేసి మత్స్యకారుల హక్కులు కాపాడారు. వెనుకబడిన జిల్లా అంటూ విని విని విని బాధపడుతూ వచ్చా .. శ్రీకాకుళం సెట్

మిగతా 2 లో



## ఏపీ లిక్కర్ స్కామ్ లోకల్ కాదు...

# ఇంటర్నేషనల్

ఏపీ లిక్కర్ స్కామ్ రూ. 3200 కోట్లు కాదు.. రూ.10 వేల కోట్లకు పైనే అన్న ఎమ్మెల్యే

అధికారిక సేల్ తగ్గించి అక్రమంగా అమ్మేసి వేల కోట్లు దోచేశారని ఆరోపణ

అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** వైసీపీ పాలనలో ఇంటర్నేషనల్ స్థాయిలో లిక్కర్ స్కామ్ జరిగిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు మీడియాతో మాట్లాడుతూ అన్నారు. రూ.1.30 లక్షల కోట్ల విలువైన నగదు లావాదేవీలు జరగడం దేశంలో ఎక్కడైనా చూశామా అని ఆయన ప్రశ్నించారు.

మిగతా 2 లో



## గతంలో తనను 16 నెలల జైల్లో ఉంచారని ప్రజలే...

# అండగా నిలిచారు

అప్పటిలా కాదు... ఇప్పుడు ప్రతి గ్రామంలో మనం ఉన్నాం: జగన్

వైసీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో జగన్ వ్యాఖ్యలు

ఇప్పుడు కూడా ప్రజలే తీవ్రంగా స్పందిస్తారని ఆశాభావం

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** తెలుగు దేశం కూటమి ప్రభుత్వం ఎన్ని తప్పుడు కేసులు నమోదు చేసినా, ఇబ్బందులకు గురి చేసినా తాను కానీ, పార్టీ శ్రేణులు కానీ భయపడే ప్రసక్తి లేదని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో తనను అన్యాయంగా 16 నెలల పాటు జైలులో ఉంచారని, పార్టీని నడపలేని పరిస్థితులు కల్పించినా ప్రజలు తనను, పార్టీని ఆదరించారని ఆయన గుర్తు చేసుకున్నారు.పీఏసీ సమావేశంలో జగన్ మాట్లాడుతూ, "నాడు నన్ను 16 నెలలు జైలులో పెట్టారు. పార్టీని నడిపే పరిస్థితి లేకుండా చేశారు. అయినా ప్రజలు ఆశీర్వదించారు. ఇప్పుడు ప్రతి ...న

మిగతా 2 లో



## ప్రజల సమస్యలను లోతుగా ఆలకించడం...

# చాలా ముఖ్యం

వినడం, ప్రేమించడం నేర్చుకున్నా: రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు

భారత్ జోడో యాత్రలో సరిగ్గా వినడం నేర్చుకున్నట్లు రాహుల్ వెల్లడి

రాజకీయాల్లో 'ప్రేమ', 'ఆప్యాయత' వ్యక్తం చేయడం ప్రారంభించినట్లు వెల్లడి

ఈ మార్పు ప్రజలతో తన అనుబంధాన్ని సులభతరం చేసిందని వ్యాఖ్య

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల తాను చేపట్టిన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా నేర్చుకున్న కీలక పాఠాలను పంచుకున్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజల మాటలు వినడం కంటే మాట్లాడటానికే

మిగతా 2 లో



## వరంగల్ సభ సరికొత్త చరిత్రను...

# సృష్టించబోతోంది : కేటీఆర్

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** రాష్ట్ర రాజకీయాల్లో వరంగల్ సభ సరికొత్త చరిత్రను సృష్టించబోతోందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఓరుగల్లు వేదికగా ఆదివారం జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా తెలంగాణ సబ్బండవర్గాల ప్రజలు లక్షలాదిగా తరలిరావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని పార్టీ ముఖ్యనేతలతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో

మిగతా 2 లో



# సంపాదకీయం

## ఇంకా ఆ పీడకలే....

జమ్ము కశ్మీర్ లో ప్రసిద్ధ పర్యటక ప్రాంతమైన పహల్గాంలో జరిగిన తీవ్రవాదుల దాడిలో 26 మంది పర్యటకులు చనిపోవడంతో ఆ ప్రాంతంలో భయాందోళనలు పెరిగాయి.జమ్ము కశ్మీర్ నుంచి తిరుగు పయనమైన పర్యటకుల సంఖ్య పెరిగిపోయింది. పర్యటకులను శ్రీనగర్ విమానాశ్రయానికి చేర్చే టాక్సీలు బారులు తీరుతున్నాయి. హైవేలపై కూడా తిరుగు ప్రయాణికులను తీసుకువెళ్లే వాహనాల సంఖ్య పెరుగుతోంది."మాకు భయంగా ఉంది. టెర్రరిస్టులు ఎక్కడ ఉన్నారో, తర్వాత ఏం జరుగుతుందో తెలియదు" అని గౌతమ్ అనే టూరిస్ట్ చెప్పారు. జమ్ము కశ్మీర్‌లో పర్యటించేందుకు ఆయన బోలెడు ప్రణాళికలతో వచ్చారు. కానీ ఇప్పుడాయన ఇంటికి తిరిగి వెళ్లిపోయే హడావుడిలో ఉన్నారు.జమ్ము కశ్మీర్ దశాబ్దాలుగా హింసకు కేంద్రంగా ఉన్నప్పటికీ, పర్యటకుల మీద దాడులు జరగడం చాలా అరుదు."ఇటీవలి సంవత్సరాలలో సాధారణ పౌరులను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడుల్లో ఇది చాలా పెద్దది" అని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు.1947లో బ్రిటిషర్ల నుంచి స్వాతంత్ర్యం పొందిన తర్వాత ఈ రెండు దేశాలు ముస్లింలు మెజార్టీగా ఉన్న కశ్మీర్ కోసం రెండు యుద్ధాలు చేశాయి. 1980, 90లలో భారతదేశ పాలనకు వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో చెలరేగిన అసంతృప్తి తిరుగుబాటుకు దారి తీసింది. దీనికి పాకిస్తాన్ నిధులు అందిస్తోందని భారతదేశం ఆరోపిస్తోంది. ఈ సంఘర్షణలో వేల మంది చనిపోయారు. అయితే ఇటీవలి సంవత్సరాలలో హింస తగ్గిందని ప్రభుత్వం చెబుతోంది.2004- 2014 మధ్య 7217 టెర్రరిస్ట్ సంఘటనలు జరిగాయని, అయితే 2014 నుంచి 2024 మధ్య వాటి సంఖ్య 2242కి తగ్గింది" అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో చెప్పారు.సంప్రదాయంగా ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు అతి పెద్ద చోదకశక్తిగా ఉన్న పర్యటకం, ఇటీవల బాగా పుంజుకుంది.2023లో జమ్ము కశ్మీర్‌ను 2 కోట్ల మంది పర్యటకులు సందర్శించారని భారత పర్యటక శాఖ తెలిపింది. కోవిడ్‌కు ముందున్న సంఖ్యతో పోలిస్తే ఇది 20శాతం ఎక్కువ.అయితే పహల్గాం దాడి తర్వాత ఈ పరిస్థితికి ముప్పులా కనిపిస్తోంది."అంతా అయిపోయింది. నాకు కన్నీళ్లు వస్తున్నాయి" అని పహల్గాంలో శాలువాలు అమ్ముకునే షకీల్ అహ్మద్ చెప్పారు."మా జీవితం అంతా పర్యటకుల మీద ఆధారపడి ఉంది. నేను బ్యాంకు నుంచి అప్పు తీసుకుని ఈ వ్యాపారం చేస్తున్నాను. ఇప్పుడు నా వస్తువులను కొనుక్కోవడానికి ఎవరూ లేరు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు."పాశవికమైన, క్రూరమైన దాడి. ఇది కశ్మీర్‌కు, ఈ ప్రాంత పర్యటక పరిశ్రమకు చెడ్డవార్త " అని స్థానిక హోటల్ వ్యాపారి జావెద్ అహ్మద్ చెప్పారు.అహ్మద్ హోటల్‌లో రూములు జూన్ వరకు బుక్ అయ్యాయి. అయితే ఇప్పుడీ సంఘటన కారణంగా పర్యటకులు రావడం ఆగిపోయినా, బుకింగ్స్ రద్దు చేసుకున్నా, తన వ్యాపారం దెబ్బ తింటుందని ఆయన ఆందోళన చెందుతున్నారు.జమ్ము కశ్మీర్‌లో పర్యటక రంగానికి ఇది కీలకమైన సీజన్. వేసవి ఎండల నుంచి ఉపశమనం కలిగించే స్వర్గధామంలా ఈ ప్రాంతాన్ని పరిగణిస్తుంటారు. పాఠశాలలకు వేసవి సెలవుల కారణంగా దేశం నలుమూలల నుంచి కుటుంబసమేతంగా ఇక్కడకు వస్తుంటారు.అయితే ఈ సెలవుల సీజన్ భిన్నంగా ఉండే అవకాశం ఉంది. ఎందుకంటే కశ్మీర్ లోయ ఇప్పుడు భద్రతా చట్రంలో చిక్కుకుపోయింది.ప్రస్తుతం శ్రీనగర్‌లోని పర్యటకులలో భయం ఏర్పడిందని, త్వరలో వెళ్లాలనుకుంటున్న వారిలో ఆగ్రహం, భయం ఉన్నాయని ముంబయి కేంద్రంగా గ్రూప్ టూర్స్‌ను నిర్వహించే అభిషేక్ హాలిడేస్ సంస్థ అధిపతి అభిషేక్ సంసారే చెప్పారు.బుకింగ్‌లను రద్దు చేయాలని అనేకమంది ఫోన్లు చేస్తున్నారు" అని ఆయన చెప్పారు.ఈ దాడిని ప్రపంచ దేశాల నాయకులు ఖండించారు. దాడికి పాల్పడిన వారిని శిక్షిస్తామని ప్రధానమంత్రి మోదీ, హోంమంత్రి అమిత్‌షా చెప్పారు.బాధితులకు న్యాయం జరగాలని కోరుతూ కశ్మీరీలు నిరసన ప్రదర్శనలు చేశారు.పహల్గాం లైన్ ఆఫ్ కంట్రోల్ నుంచి 200 కిలోమీటర్ల దూరంలో ఉంది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి తొలగించిన తర్వాత ఈ ప్రాంతంలో పర్యటక రంగానికి ఊపు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. 2023లో జీ ట్వంటీ టూరిజం వర్క్‌షాప్ గ్రూప్ సమావేశానికి శ్రీనగర్ ఆతిథ్యమిచ్చింది. ఈ సమావేశానికి అనేక మంది విదేశీ అతిథులు హాజరయ్యారు.ప్రత్యేక ప్రతిపత్తి తొలగించిన తర్వాత తొలిసారి 2024లో శ్రీనగర్‌లో పర్యటించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్థానికంగా వ్యవసాయ, పర్యటక రంగాల అభివృద్ధికి 6,400 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రకటించారు. "అభివృద్ధిలో జమ్మూ కశ్మీర్ కొత్త ఎత్తుల్ని తాకుతోంది. ఎందుకంటే అది ఇప్పుడు స్వేచ్ఛా వాయువుల్ని పీలుస్తోంది. ఈ ప్రాంత అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న ఆర్టికల్ 370 తొలగించిన తర్వాత స్వేచ్ఛ వచ్చింది" అని ప్రధాని మోదీ అన్నారు. ఆర్టికల్ 370 తొలగించిన తొలినాళ్లలో, పరిస్థితులు ఇంకా చక్కబడకముందే పర్యటకుల సంఖ్య పెరుగుతోందని కొందరు ఆందోళన చెందారు."పర్యటకం అంటే సాధారణ స్థితి కాదు. ఇది ఆర్థిక కార్యకలాపాలకు సూచిక. సాధారణ స్థితి అంటే భయం లేకపోవడం. టెర్రరిజం లేకపోవడం, ఉగ్రవాదుల దాడులు తగ్గడం, ప్రజాస్వామిక పాలన వల్ల కశ్మీర్ ప్రస్తుతం సాధారణంగా ఉంది" అని ప్రస్తుత ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా 2022లో అన్నారు.2024లో జరిగిన ఎన్నికల్లో గెలిచి ఆయన ముఖ్యమంత్రి అయ్యారు.పహల్గాం దాడి ఘటనపై ఆయన ఎక్స్‌లో స్పందించారు. "టెర్రరిస్టుల దాడి తర్వాత పర్యటకులు కశ్మీర్ లోయ నుంచి వెళ్లిపోవడం చూస్తుంటే హృదయ విదారకంగా ఉంది" అని ఆయన అందులో పేర్కొన్నారు.పచ్చని పచ్చిక బయళ్లతో ప్రకృతి సౌందర్యంతో పర్యటకులకు మరపురాని అనుభూతిని పంచుతుంది. సినిమా నిర్మాతలకు చాలా ఇష్టమైన ప్రాంతం కూడా.హింసాత్మక దాడులు చాలా తక్కువ. అలాంటిది మంగళవారం జరిగిన దాడి అనేక మందిని నిర్ఘాంత పోయేలా చేసింది."క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఏంటో ఇప్పుడు దేశం మొత్తానికి తెలిశాయి" అని శ్రీనగర్‌లో కశ్మీర్ హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ నాయకత్వంలో నిరసన ప్రదర్శన చేసిన తర్వాత మెహబూబ్ హుస్సేన్ మీర్ చెప్పారు."ప్రత్యేక ప్రతిపత్తి తొలగించడానికి ముందు, తొలగించిన తర్వాత కూడా దాడులు జరుగుతున్నాయి. ఇక్కడ ఎప్పుడూ అశాంతి రాజ్యమేలుతుంది. దీని వల్ల స్థానికులే బాధ పడుతున్నారు. దీనికి ప్రభుత్వం పరిష్కారం కనుక్కోవాలి. లేకపోతే మా జీవితాలు ఊగిసలాడుతూనే ఉంటాయి" అన్నారు.

## ఏపీ లిక్కర్ స్కామ్ లోకల్ కాదు...

అక్రమంగా దోచేయడం కోసమే మద్యం వ్యాపారంలో డిజిటల్ పేమెంట్లను జగన్ సర్కార్ అనుమతించలేదని ఆరోపించారు.ఓ వైపు ప్రధానమంత్రి మోదీ డిజిటల్ ఇండియా అంటుంటే జగన్ రెడ్డి మాత్రం క్యాష్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని విమర్శించారు. ప్రస్తుతం ఈ కుంభకోణంపై విచారణ సాగిస్తున్న సిట్ మరింత లోతుగా వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ లిక్కర్ స్కామ్ రూ. 3200 కోట్లకు పరిమితం కాలేదని, రూ.10 వేల కోట్లకు పైనే అని అన్నారు. వేల కోట్ల అక్రమాలు, మనీ లాండరింగ్ జరిగితే ఈడీ, సీబీఐ ఎందుకు రంగంలో దిగడం లేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశ్నించారు. రూ.1.30 లక్షల కోట్ల క్యాష్ ట్రాన్సాక్షన్ జరుగుతుంటే గత ఐదేళ్లు ఈడీ, సీబీఐ ఈ కుంభకోణంపై ఎందుకు దృష్టి సారించలేదన్నారు. 1989లో రూ.60 కోట్ల విలువైన బోఫోర్స్ కుంభకోణం రాజీవ్ గాంధీ కొంపముంచిందని, 2014లో 2జీ స్కాం మన్మోహన్ సింగ్‌ను దెబ్బకొట్టిందని గుర్తు చేశారు. ఈ రెండు స్కాములు కాంగ్రెస్ పార్టీకి జాతీయ హోదా కోల్పోయే పరిస్థితి తెచ్చాయన్నారు. ఏపీలో జరిగిన లిక్కర్ స్కామ్ ఆషామాషీ కేసు కాదని తెలిపారు. కరోనా సమయంలో 2020 మార్చి 23న లాక్ డౌన్ విధించారు... మే 4న మద్యం దుకాణాలను రీ ఓపెనింగ్ చేశారు... ఆ 42 రోజులు మాత్రమే మద్యం విక్రయాలు ఆగాయని, కానీ లక్షల క్రేట్ల మద్యం విక్రయాలు తగ్గిపోయినట్లు లెక్క చూపించారని ఎమ్మెల్యే మండిపడ్డారు. జగన్ రెడ్డి పర్యవేక్షణలో నడిచిన కసిరెడ్డి అండ్ టీం ఎక్సైజ్ డిపార్టుమెంటులోని మద్యం డిపోలకు వెళ్లకుండా, స్కానింగ్ కాకుండా డిస్టిలరీల నుంచి నేరుగా దుకాణాలకు స్టాక్ తరలించి అక్రమంగా అమ్మేసుకున్నారని ఆరోపించారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుటుంబానికి చెందిన మెక్ డోవెల్ డిస్టిలరీ మూసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. అడిగినంత కమీషన్లు ఇవ్వలేదని నేషనల్, ఇంటర్నేషనల్ బ్రాండ్ల డిస్టిలరీలను అడ్డంగా మూసేశారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి 3 బాటిల్స్ తీసుకునే వెసులుబాటును కూడా తొక్కేశారని, తామిచ్చిన మద్యమే తాగాలని నియంతలా వ్యవహరించారని... జగన్ రెడ్డి అండ్ బ్యాచ్ కు డబ్బుపై ఉన్న వ్యామోహంతోనే ఇది జరిగిందని ఎమ్మెల్యే సోమిరెడ్డి అన్నారు. ఐఎస్ఐ గుర్తింపు పొందిన చెన్నైలోని ప్రముఖ ఎస్.జీ.ఎస్ లేబరేటరీ జగన్ ప్రభుత్వం విక్రయించిన సొంత మద్యం బ్రాండ్లపై సంచలన విషయాలను బయటపెట్టిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. వైసీపీ ప్రత్యేకంగా ప్రోత్సహించిన ఆంధ్రా గోల్డ్, 9సీ హార్సెస్, సిల్వర్ స్ట్రైప్ విస్కీలలో ప్రమాదకరమైన పైరోగలాల్, ఐసోపులరిక్ యాసిడ్, డైఇథనాల్ టాలెట్ ఉన్నాయని తేల్చిందన్నారు. ఇవి తాగితే శరీరంలోని అవయవాలు దెబ్బతిని ప్రాణాలు కోల్పోతారని స్పష్టంగా నివేదికలు ఉన్నాయని తెలిపారు. ఏపీలో కల్తీ మద్యం తాగి ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు వేల మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షల మంది మంచాన పడ్డారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఓట్లతో సీఎంగా ఎన్నికైన వ్యక్తి వారి జేబుల్లోని డబ్బును లాక్కోవడమే గాక వారి ప్రాణాలను తీసేయడం దుర్మార్గమన్నారు. కసిరెడ్డి అండ్ బ్యాచ్ మద్యం వ్యాపారాన్ని తమ చేతుల్లోకి తీసుకుందని, డిస్టలరీలను తమ గుప్పెట్లో పెట్టుకుని నాసిరకమైన మద్యం తయారు చేయించిందని ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆరోపించారు. బ్రాండ్ ను బట్టి క్రేట్(48 బాటిల్స్) కు రూ.150 నుంచి రూ.600 చొప్పున కమీషన్ వసూలు చేశారని, అనఫిషియల్ సేల్ తో ఒక్కో క్రేట్ కు రూ.10 వేల వరకు ఆర్జించారని తెలిపారు. నడిబజారులో జరిగిన ఈ స్కామ్ ప్రత్యక్షంగా కనిపిస్తోంది.. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఈడీ, సీబీఐలను రంగంలోకి దించాలని ఆయన కోరారు. రూ.1000 లంచం తీసుకున్న ప్రభుత్వ ఉద్యోగిని ఏసీబీ అరెస్ట్ చేసి జైలుకు పంపుతుందని, వేల కోట్లు దోచేసి ప్రజల ప్రాణాలు తీసేసిన వారికి ఏ శిక్ష వేయాలని ప్రశ్నించారు. క్యాష్ ట్రాన్సాక్షన్ కరెక్ట్ అని, ఈ మందు తాగినందున ఎవరూ చనిపోలేదు అని వైసీపీలోని పెద్ద నాయకులు, జగన్ రెడ్డి రైట్లు, లెఫ్టులు ఎవరైనా చెప్పగలరా అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి సవాల్ చేశారు. మధ్యలో లక్షల క్రేట్ల మద్యం సేల్ ఎందుకు తగ్గిపోయిందో సమాధానం చెబుతారా అని ప్రశ్నించారు. మద్యపాన నిషేధం అమలు చేస్తానని చెప్పి కల్తీ మద్యం పోసి ప్రాణాలు తీయడం క్షమించరాని నేరం అన్నారు.

## తిరుమలలో మళ్లీ...



యూనివర్సిటీ దగ్గర ఓ బోన్ ఏర్పాటు చేశారు. అక్కడ వారికి చిరుత దొరికింది. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అయితే తాజాగా మరోసారి చిరుత కనిపించడంతో భయాందోళన చెందుతున్నారు. కాగా, చిరుతల పర్యవేక్షణకు ఒక ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడానికి ఏపీ అటవీ శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. శాటిలైట్, జీపీఎస్, అధునాతన కెమెరాల వంటి వ్యవస్థలతో చిరుతల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం అటవీ మ్యూజియం ఉన్న భవనంలోనే ఈ సెల్‌ను ఏర్పాటుచేయనున్నారు.

## దాడి చేసిన వారిని...




'టేక్ హిమ్ కస్టడీ' అన్నట్లుగా రంగరాజన్ గుర్తు చేశారు. ఆ వ్యక్తి మాటలు విని ఎవరో పెద్ద అధికారై ఉంటారని తాను భావించానన్నారు. ఆ తర్వాత సుమారు 20 మంది వ్యక్తులు ఒక్కసారిగా తలుపులు తోసుకుని ఇంట్లోకి ప్రవేశించారని రంగరాజన్ పేర్కొన్నారు. వారు నన్ను కాళ్లు పట్టి లాగి కిందపడేసి దాడి చేశారని, ఈ ఘటనతో నేను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. ఈ దాడిని తేలిగ్గా తీసుకునేది లేదని, దీనిపై కచ్చితంగా న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. దాడికి పాల్పడిన వారిపై సివిల్, క్రిమినల్ పరువు నష్టం దావాలు వేస్తామన్నారు. ఈ దాడి వెనుక ఆలయానికి సంబంధించిన కోర్టు వివాదమే కారణమని రంగరాజన్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఆలయానికి సంబంధించిన విషయం కోర్టు పరిధిలో ఉందని.. ఈ దాడి వెనుక ఎంత పెద్దవారు ఉన్నా సరే, శిఖండిలా తెర వెనుక ఉండి వ్యవహరించొద్దన్నారు. తమపై ఆరోపణలు చేసేవారు కోర్టులో వాదనలు వినిపించి, తాము తప్పు చేయలేదని నిరూపించుకోవాలని రంగరాజన్ సవాల్ విసిరారు.

## రాజకీయ వ్యూహాత్మక చర్యలు...

శ్రీనగర్ : జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 25 భారతీయులు, ఒక నేపాలీ పౌరుడు మరణించారు. ఇది గత రెండు దశాబ్దాలలో భారత్‌లో పౌరులపై జరిగిన అత్యంత ఘోరమైన దాడుల్లో ఒకటిగా నిలిచింది. ఈ దాడి కాశ్మీర్‌లోని బైసరాన్ మేడో వద్ద జరిగింది. దీనిని 'మినీ స్విట్జర్లాండ్' అని పిలుస్తారు. ఈ ఘటనకు ప్రతిస్పందనగా, భారత్ పాకిస్థాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడిని తీవ్రతరం చేసింది, సింధూ జలాల ఒప్పందంను నిలిపివేసింది, అట్టారీ?వాఘా సరిహద్దును మూసివేసింది. పాకిస్థాన్ దౌత్యవేత్తలను బహిష్కరించింది. అయినప్పటికీ, దేశవ్యాప్తంగా ప్రజలు ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, భారత్ ఎదుట ఉన్న సైనిక ఎంపికలు రాజకీయ, వ్యూహాత్మక చర్చలకు కేంద్రబిందువుగా మారాయి.భారత వాయుసేన రఫేల్, మిరాజ్ 2000 వంటి అత్యాధునిక ఫైటర్ జెట్లను ఉపయోగించి, పాకిస్థాన్‌లోని కీలక సైనిక కేంద్రాలు లేదా ఉగ్రవాద స్థావరాలపై కచ్చితమైన దాడులు చేయడం ఒక ఎంపికగా ఉంది. 2019 బాలాకోట్ ఎయిర్‌స్ట్రైక్‌ల తర్వాత సేకరించిన అనుభవాలను ఉపయోగించి, ఈ జెట్లు ప్రత్యర్థి రక్షణ వ్యవస్థలను ఛేదించే సామర్థ్యం కలిగి ఉన్నాయి. అయితే, ఇటువంటి దాడులు అంతర్జాతీయ ఒత్తిడిని తెచ్చిపెట్టవచ్చు. ముఖ్యంగా యునైటెడ్ నేషన్స్ లేదా ఇతర ప్రముఖ దేశాల నుంచి . ఈ ఎంపిక అమలు చేయాలంటే, భారత్ దౌత్యపరమైన ఒత్తిడిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. దాడులు కచ్చితమైన ఇంటెలిజెన్స్‌పై ఆధారపడి ఉండాలి.పాకిస్థాన్ ఇటీవల సిమ్లా ఒప్పందంను నిలిపివేస్తామని బెదిరించడంతో, నియంత్రణ రేఖ యొక్క పవిత్రతను ప్రశ్నార్థకం చేసింది. ఇది భారత్‌కు ఎల్ఓసీ దాటి ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసే అవకాశాన్ని అందిస్తుంది. ఇటీవలి ఎల్ఓసీ వద్ద పాకిస్థాన్ జరిపిన సీజ్‌ఫైర్ ఉల్లంఘనలు భారత్‌కు ఈ చర్యలకు నైతిక, వ్యూహాత్మక కారణాన్ని అందిస్తాయి. అయితే, కాశ్మీర్ కఠినమైన భౌగోళిక పరిస్థితులు, పాకిస్థాన్ దళాల బలమైన స్థానాలు, మరియు సుదీర్ఘ ఆపరేషన్ సమయం ఈ ఎంపికను సవాలుగా మార్చవచ్చు. ఈ కార్యకలాపాలు సమర్థవంతంగా అమలు చేయాలంటే, అధిక స్థాయి సమన్వయం మరియు రియల్?టైమ్ ఇంటెలిజెన్స్ అవసరం.2016 సర్జికల్ స్ట్రైక్స్ విజయవంతమైన నేపథ్యంలో, భారత్ పాకిస్థాన్‌లోని పెద్ద ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకొని మరోసారి సర్జికల్ స్ట్రైక్స్ చేపట్టవచ్చు. అయితే, పహల్గాం దాడి తర్వాత పాకిస్థాన్ అప్రమత్తంగా ఉండటం వల్ల ఈ దాడులు ఊహించని ప్రభావాన్ని సృష్టించకపోవచ్చు. విజయవంతమైన సర్జికల్ స్ట్రైక్స్‌కు రియల్?టైమ్ ఇంటెలిజెన్స్, శక్తివంతమైన స్పెషల్ ఫోర్సెస్, కచ్చితమైన ప్లానింగ్ అవసరం. ఈ ఎంపిక తక్కువ స్థాయి ఉద్రిక్తతలను సృష్టిస్తుంది. కానీ భారీ ఫలితాలను హామీ ఇవ్వదు, ముఖ్యంగా పాకిస్థాన్ రక్షణ వ్యవస్థలు హై అలర్ట్‌లో ఉన్నప్పుడు.ఎల్ఓసీ సమీపంలో ఉన్న పాకిస్థాన్ ఔట్‌పోస్ట్‌లు, సరఫరా మార్గాలు, లేదా ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకొని శతఘ్నులు, స్నైపర్ గన్స్, భారీ మోర్టార్‌లతో దాడులు చేయడం మరో ఎంపిక. ఈ దాడులు తక్కువ ఉద్రిక్తతలను సష్టిస్తాయి మరియు అంతర్జాతీయ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఈ విధానం శత్రు యొక్క సామర్థ్యాలను క్రమంగా బలహీనపరచడంలో సహాయపడుతుంది. కానీ భారీ సైనిక దాడుల వలె గణనీయమైన ఫలితాలను ఇవ్వకపోవచ్చు. ఈ ఎంపిక అమలు సరిహద్దు వెంబడి ఉన్న భారత సైన్యం ఖచ్చితత్వం, సాంకేతిక సామర్థ్యాలపై ఆధారపడుతుంది.సైనిక చర్యలు తీసుకోవడం వల్ల అంతర్జాతీయ సమాజం నుంచి, ముఖ్యంగా ఐక్యరాష్ట్రాలు, చైనా, లేదా ఐరోపా దేశాల నుంచి ఒత్తిడి రావచ్చు. పాకిస్థాన్ ఇప్పటికే సింధూ జలాల ఒప్పందం నిలిపివేతను 'యుద్ధ చర్య'గా పేర్కొంది. ఈ ఒప్పందాన్ని పాకిస్థాన్‌కు జీవనాడిగా భావిస్తోంది, ఎందుకంటే ఇది 240 మిలియన్ల పాకిస్థానీయుల నీటి అవసరాలను తీరుస్తుంది. అదనంగా, పాకిస్థాన్ తమ వైపు నుంచి సిమ్లా ఒప్పందం సహా అన్ని ద్వైపాక్షిక ఒప్పందాలను నిలిపివేస్తామని బెదిరించింది, ఇది భారత్‌కు సైనిక చర్యలకు మరింత నైతిక కారణాన్ని అందిస్తుంది. అయితే, భారత్ ఈ చర్యలను అమలు చేయాలంటే, దౌత్యపరమైన సమతుల్యతను కాపాడుకోవడం, అంతర్జాతీయ మద్దతును సమీకరించడం కీలకం. ఉదాహరణకు, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ ఈ దాడిని ఖండిస్తూ భారత్‌కు సంఘీభావం తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ దాడికి సంబంధించి "ప్రతి ఉగ్రవాదిని, వారి మద్దతుదారులను గుర్తించి, ఊహించని విధంగా శిక్షిస్తామని" ప్రతిజ్ఞ చేసింది. అయితే, సైనిక చర్యలపై ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరిస్తోంది, ఎందుకంటే ఏదైనా తప్పిదం ద్వైపాక్షిక ఉద్రిక్తతలను యుద్ధ స్థాయికి తీసుకెళ్లవచ్చు. ఏప్రిల్ 25న హోం మినిస్టర్ అమిత్ షా నివాసంలో సింధూ జలాల ఒప్పందం సస్పెన్షన్‌పై జరిగిన సమావేశం, ఈ చర్యల యొక్క వ్యూహాత్మక ప్రాముఖ్యతను సూచిస్తుంది. అదనంగా, సరిహద్దులో భారత సైన్యం హై అలర్ట్‌లో ఉంది, మరియు సైన్యం అధిపతి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు, ఇది సైనిక సన్నాహాలను సూచిస్తుందిపహల్గాం దాడి భారత్?పాకిస్థాన్ సంబంధాలను 2019 పుల్వామా దాడి తర్వాత స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు ద్వైపాక్షిక సంబంధాలు దాదాపు శూన్య స్థాయికి చేరుకున్నాయి. సైనిక చర్యలు తీసుకుంటే, అవి భారత్ యొక్క జాతీయ భద్రతా లక్ష్యాలను బలపరచవచ్చు కానీ ఆర్థిక, రాజకీయ ఖర్చులను కలిగిస్తాయి. దౌత్యపరమైన చర్యలు, సింధూ జలాల ఒప్పందం సస్పెన్షన్ వంటివి, పాకిస్థాన్‌పై దీర్ఘకాలిక ఒత్తిడిని సృష్టిస్తాయి, కానీ సైనిక చర్యలు తక్షణ ఫలితాలను అందించవచ్చు. భారత్ యొక్క తదుపరి చర్యలు దేశీయ ఒత్తిడి, అంతర్జాతీయ రాజకీయాలు, వ్యూహాత్మక లక్ష్యాల సమతుల్యతపై ఆధారపడి ఉంటాయి.

## గతంలో తనను ....



పార్టీ ఉంది. వాళ్లు ఎన్ని కేసులు పెడితే ప్రజలు అంత తీవ్రంగా స్పందిస్తారు. నన్ను మరోసారి జైలుకు పంపినంత మాత్రాన ప్రజా వ్యతిరేకతను అణచివేయలేరు" అని అన్నారు. గతంలో అక్రమాస్తుల కేసులో తనను అన్యాయంగా ఇరికించి జైలుకు పంపినా, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి అఖండ విజయాన్ని అందించారని జగన్ గుర్తుచేశారు. అదే విధంగా, ఇప్పుడు కూడా ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని కేసులు బనాయించినా ప్రజల మద్దతు తమకే ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు ఎదురైనా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని జగన్ ఈ సమావేశం ద్వారా సంకేతాలు పంపారు. ప్రభుత్వ చర్యల వల్ల ప్రజల్లో వ్యతిరేకత పెరిగి, అది అంతిమంగా తమ పార్టీకే లాభిస్తుందని అభిప్రాయపడ్డారు.

## మీ సమస్యలను తెలుసుకునేందుకు...

ఇవ్వాలంటే.. మన మైండ్ సెట్ మారాలి. సుదీర్ఘ తీర ప్రాంతంలో ఒక్క పోర్ట్ లేకపోయింది. పోర్ట్‌తో పాటు ఎయిర్ పోర్ట్ కూడా నిర్మిస్తాం. కేంద్రంతో మాట్లాడి జెట్టీలు, హార్బర్‌లు నిర్మిస్తాం. ఏం తక్కవ మన జిల్లాకు. అన్ని వనరులు ఉన్నాయి. యువత ఉపయోగించుకోవాలి.. సహకారం అందిస్తాం' అని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. కాగా.. మత్స్యకారుల సేవలో పథకం ద్వారా మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున సాయం అందిచనున్నారు. సముద్రంలో వేట విరామ సమయంలో ఆర్థిక సాయం అందించనున్నారు.ఈ పథకం కింద 1,29,178 కుటుంబాలకు రూ.258 కోట్ల లబ్ధి చేకూరనుంది.

## ప్రజల సమస్యలను లోతుగా ఆలకించడం...

ప్రాధాన్యత ఇచ్చానని, కానీ యాత్ర సమయంలో అసలైన 'వినడం' అంటే ఏమిటో నేర్చుకున్నానని ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. యాత్రలో ప్రజలతో మమేకమైనప్పుడు, వారి సమస్యలను, భావాలను లోతుగా అర్థం చేసుకునే ప్రయత్నం చేశానని తెలిపారు.యాత్ర ప్రారంభంలో తన మనసులో సంభాషణలు కొనసాగుతూ ఉండేవని, కానీ క్రమేణా పూర్తిగా నిశ్శబ్దంగా మారి ఎదుటివారు చెప్పేది మాత్రమే వినడం అలవాటైందని రాహుల్ వివరించారు. ఈ క్రమంలో ఒక మహిళ తనను కలిసి, తన భర్త తనను కొడుతున్నాడని, ఆ విషయం తాను తెలుసుకోవాలన్నదే ఆమె ఉద్దేశమని చెప్పిన సంఘటనను గుర్తు చేసుకున్నారు. ఆమె బాధను విన్న తర్వాత, ఆమెలో భయం పోయి ప్రశాంతత కనిపించిందని, కేవలం వినడం ద్వారానే ఎంతో మార్పు తీసుకురావచ్చని గ్రహించానని అన్నారు. ప్రజలు చెప్పేది వినడం అనేది ఎంతో ముఖ్యమని, తాము తీసుకోగల చర్యల కన్నా ఇది శక్తివంతమైనదని తాను భావిస్తున్నట్లు తెలిపారు.ప్రతిపక్షాలు ప్రజల మాటలను వినడానికి సిద్ధంగా లేవని, వారికి అన్ని సమాధానాలు ముందే తెలుసని భావిస్తారని రాహుల్ విమర్శించారు. ఆధునిక కమ్యూనికేషన్ సాధనాలు ఎన్ని ఉన్నా, రాజకీయ నాయకులుగా ప్రజల గొంతును లోతుగా వినడంలో విఫలమవుతున్నామని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఖాళీని తాము భర్తీ చేయగలమని ఆశాభావం వ్యక్తం చేశారు.అంతేకాకుండా, 2004 నుంచి రాజకీయాల్లో ఉన్నప్పటికీ, ప్రజల పట్ల 'ప్రేమ', 'ఆప్యాయత' వంటి పదాలను తాను ఎప్పుడూ బహిరంగంగా వ్యక్తం చేయలేదని రాహుల్ అంగీకరించారు. యాత్రలో ఈ పదాలను ఉపయోగించడం ప్రారంభించాక, ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చిందని, వారు కూడా తన పట్ల ప్రేమను వ్యక్తం చేయడం మొదలుపెట్టారని అన్నారు. విధానాలు, భవిష్యత్తు ప్రణాళికల ద్వారా కాకుండా, ప్రేమ, ఆప్యాయతల ద్వారా ప్రజలతో నేరుగా, తక్షణమే కనెక్ట్ అవ్వడం సాధ్యమని తాను నమ్ముతున్నట్లు తెలిపారు. 'ద్వేషం బజారులో ప్రేమ దుకాణం' (నఫ్రత్ కే బజార్ మే మొహబ్బత్ కీ దుకాన్) అనే నినాదం వెనుక ఉన్న ఉద్దేశ్యం కూడా ఇదేనని, ఎంత ద్వేషం ప్రచారం చేసినా, దానికి ప్రేమ, ఆప్యాయతలతోనే అత్యంత శక్తివంతంగా బదులివ్వగలమని ఆయన స్పష్టం చేశారు. ఈ మార్పు తన రాజకీయాలను, ప్రజలతో తన సంబంధాన్ని సులభతరం చేసిందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

## వరంగల్ సభ సరికొత్త చరిత్రను...



పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ఉదయాన్నే గులాబీ జెండాలు ఆవిష్కరించి కదలిరావాలని సూచించారు. పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక సభ కావడంతో సభకు హాజరయ్యే వారంతా గులాబీ రంగు దుస్తులు ధరించి రావాలని కోరారు. రాష్ట్ర నలుమూలల నుంచి సభకు తరలిరావాలనే ఉత్సాహం ప్రజల్లో పెద్ద ఎత్తున ఉందని, వారందరినీ సమన్వయం చేసుకొని అనుకున్న సమయానికి సభా ప్రాంగణానికి చేరుకునేలా ప్రణాళిక వేసుకోవాలని తెలిపారు. పార్టీ సిల్వర్ జూబ్లీ సభకు తరలివచ్చే ప్రతి వాహనానికి అన్ని వైపులా గులాబీ జెండాలు కట్టుకుని ఉత్సాహంగా బయలుదేరాలని సూచించారు. ఎండల వల్ల ఇబ్బంది లేకుండా ప్రతి బస్సులో మంచినీళ్ల బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు, భోజన వసతులకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ నలువైపుల నుంచి తరలివచ్చే వాహనాలు ట్రాఫిక్ జామ్ కాకుండా ఇప్పటికే రూట్ మ్యాప్ పంపించామని, దానికి అనుగుణంగానే ఆయా రూట్లలో సభ స్థలికి చేరుకోవాలని చెప్పారు. సభా ప్రాంగణానికి 30 కిలోమీటర్ల దూరం నుంచి రోడ్లపై ఎక్కడ వాహనాలు నిలపరాదని, నేరుగా సూచించిన పార్కింగ్ స్థలాలకు చేరుకొని వాహనాలను నిలపాలని సూచించారు. అనేక ప్రాంతాల్లో పార్టీ వాలంటీర్లు ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేయడానికి సిద్ధంగా ఉంటారని తెలిపారు. సభకు చేరుకునే వారందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి చోట మంచినీటి బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందించేందుకు వాలంటీర్లు సిద్ధంగా ఉంటారని తెలిపారు. చారిత్రక సభలో కేసీఆర్ గారి ప్రసంగంపై అన్ని వర్గాల్లో పెద్ద ఎత్తున ఆసక్తి నెలకొని ఉందని, రాష్ట్ర రాజకీయాల్లో ఈ సభ సరికొత్త చరిత్రను సృష్టించబోతోందని కేటీఆర్ స్పష్టం చేశారు.

### చవట గుంట మహాభారతం....

## యజ్ఞ పూజ విరాళం



వెదురు కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 26: వెదురు కుప్పం మండలం చవట గుంట మహాభారతం యజ్ఞ పూజ ఉభయ దాతలు పుత్తూరు ధనకోటి భాస్కర్ రెడ్డి రాధిక పురం రెడ్డి ఎంపీటీసీ వెదురుకుప్పం మరియు లేట్ శ్రీ తోకల రామిరెడ్డి కుమారుడు కల్పన మురళి రెడ్డి ఎంపీటీసీ పెరుమాళ్ళపల్లి కుటుంబ సభ్యుల ద్వారా పూజా కార్యక్రమం మరియు ఒకరోజు హరిదాసు కు విరాళ దాతలు వీరికి ఆలయ ధర్మకర్త మరియు కార్యనిర్వాహకులు ద్వారా ఆలయ తాంబూలం ఇవ్వడం జరిగింది.

## పవన్ సేవలు అభినందనీయం..

### ఎమ్మెల్యే డాక్టర్ థామస్



ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 26: పుల్లూరు సర్పంచ్ భవ్య పవన్ సేవలు ఎంతో అభినందనీయమని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు శనివారం ఎస్ఆర్ పురం మండల కార్యాలయం ఆవరణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ప్రారంభించారు వేసవికాలంలో ఎండ వేడిమికి తట్టుకోలేక చాలామంది స్పృహ పడిపోతుంటారు అలాంటి వారి కోసం ఇలాంటి చలివేంద్రాలు ఎంతో ఉపయోగం అని తెలియజేశారు అలాగే ఆరిమాని గంగమ్మ గుడి వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు చిరంజీవి జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు చందు చార్లెస్,మధు పైనేని మురళి, హిమాచాలపతి రెడ్డి పైనేని ధనుంజయ నాయుడు ధన వెంకటేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మదర్ తెరిసా కాలేజీలో చదువుతున్న .....

## ఫస్ట్ ఇయర్ విద్యార్థి ఆత్మహత్య



గంగవరం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 26: చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలంలో మదర్ తెరిసా కాలేజ్ నందు ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి యోగేష్ మూడు సబ్జెక్టులో ఫెయిల్ అయినందున మనస్థాపం చెంది హాస్టల్ రూమ్ లో



ఫ్యాన్కి ఉరి వేసుకున్నట్లు హాస్టల్ వార్డెన్ తెలిపారు. కుప్పం నియోజకవర్గం శాంతి పురానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు చనిపోవడానికి ముందు ఐ లవ్ యు డాడీ అని తన తండ్రి పేరును రాసి ఆత్మహత్య చేసుకున్నాడు పోలీస్ విచారణలో నిజ నిజాలు తెలియాల్సి ఉంది.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

### కడాపిడి వికాస్ మరమ్మత్

కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 26: కుప్పం పట్టణంలో ఏప్రిల్ 28 సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించాల్సి న ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్ర మాన్ని రద్దు చేసినట్లు కడపిడి వికాస్ మర్మత్ తెలిపారు. 28న కుప్పంమున్సిపల్ ఛైర్ పర్సన్ ఎన్నిక నేపథ్యంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమా న్ని రద్దు చేశామని నియోజకవర్గ ప్రజలు గమనించాలని కడా పిడి తెలియజేశారు.



# శ్రీసిటీని సందర్శించిన సెజ్ ల మార్గదర్శకుల బృందం

## దేశానికి ఉత్తమ నమూనాగా శ్రీసిటీకి ప్రశంస





శ్రీసిటీ,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 26: సెజ్ పాలసీ లక్ష్యాలకు ధీటుగా అభివృద్ధి చెందిన శ్రీసిటీ పారిశ్రామికవాడ దేశానికి ఉత్తమ నమూనాగా కేంద్ర వాణిజ్య శాఖ మాజీ కార్యదర్శి జి.కె.పిళ్లై అభివర్ణించారు. దేశంలో సెజ్ ల రూపకల్పనలో కీలక భూమిక పోషించిన పలువురు మాజీ కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు శ్రీసిటీని సందర్శించారు. దేశంలో సెజ్‌లు స్థాపించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సందర్శన చోటుచేసుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. జి.కె.పిళ్లై ఆధ్వర్యంలో విచ్చేసిన వీరికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ స్థాపన నుంచి ఇప్పటివరకు సాధించిన అభివృద్ధి, విజయాలు, ఇతర పలు ప్రత్యేకతలను వారికి వివరించారు. శ్రీసిటీ పరిసరాల సందర్శన అనంతరం పరిశ్రమల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక చర్చా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, సెజ్ పాలసీ మార్గదర్శకులు శ్రీసిటీ పర్యటనకు రావడం తనకు ఆనందంగా, గర్వంగా ఉందని వ్యాఖ్యానించారు. శ్రీసిటీ స్థాపన సమయంలో వారు అందించిన విశేష ప్రోత్సాహం, సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆ సమయంలో వారితో తన అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. 2005 ప్రత్యేక ఆర్థిక మండలాల (ఎస్ ఈ జెడ్) చట్టం అమలులో అప్పటి కేంద్ర వాణిజ్య కార్యదర్శి జి.కె.పిళ్లై ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఆయన హయాంలో 325 ఎస్ ఈ జెడ్ ల ఏర్పాటుకు మార్గం సుగమం కాగా, తద్వారా భారతదేశ ఎగుమతి పర్యావరణ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. సెజ్ ల రూపంలో దేశ ఆర్థిక ప్రగతికి బాటలు పడ్డాయన్నారు. శ్రీసిటీతో ఎంతో అనుబంధం కలిగిన ప్రముఖ వ్యక్తుల రాక, సొంత ఇంటికి వచ్చిన భావన కలిగిస్తోందన్నారు. వారి పరిశీలనలు, సూచనలు తమకు మరింత ప్రేరణ కలిగిస్తాయన్నారు. అతిథులతో అర్థవంతమైన చర్చల్లో పాల్గొనాలని పరిశ్రమ ప్రతినిధులను కోరారు. బంజరు భూమి నుంచి అద్భుత పారిశ్రామిక నగరంగా శ్రీసిటీ రూపాంతరం చెందడం ఆశ్చర్యానికి గురిచేసిందన్న పిళ్ళై, ఈ సందర్శన తనకెంతో ఆనందం కలిగించిందన్నారు. రవీంద్ర సన్నారెడ్డి దార్శనికతతో మారుమూల గ్రామీణ ప్రాంతం ప్రపంచ స్థాయి వ్యాపార నగరంగా మారిందని ప్రశంసించారు. ఆదర్శనీయమైన భూసేకరణ విధానంతో పరిశ్రమ, ఉపాధి, సుస్థిరత సమ్మేళనంతో శ్రీసిటీ సాధించిన ప్రగతి సెజ్ లక్ష్యాలను నెరవేర్చిందని ఆయన పేర్కొన్నారు. శ్రీసిటీ పెట్టుబడి-స్నేహపూర్వక పర్యావరణ వ్యవస్థను సిబిఐసి సభ్యులు యోగేంద్ర గార్గ్ కొనియాడారు. పలు అనుకూలతలు వున్న శ్రీసిటీ, ఇతరులు అనుసరించాల్సిన ఒక ఉత్తమ నమూనాగా ఆయన పేర్కొన్నారు. ఇంకా పర్యటన బృందంలోని గోవా మాజీ చీఫ్ సెక్రటరీ & జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ బి.విజయన్, మాజీ ఐఆర్ఎస్ అధికారి బిజోయ్ బిహారీ మోహపాత్రా, మాజీ ఐటిఎస్ అధికారి ఎల్.బి.సింఘాల్, సెజ్ ల అసోచామ్ కౌన్సిల్, ఇండస్ట్రియల్ పార్కులు & వేర్‌హౌసింగ్ మండలి మాజీ కోచైర్మన్ హితేంద్ర మెహతా క్లుప్తంగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రశ్నోత్తరాల సమయంలో శ్రీసిటీలోని సిద్ధార్థ లాజిస్టిక్స్ ఎండీ నిశ్చల్ పాధ్యా, మిలింద్ ముంగికర్ (డైరెక్టర్, జెన్ లినెన్), మోహన్ ( సి ఈ ఓ, రాక్‌వర్త్), మరికొందరు పలు అంశాలపై సందేహాలను లేవనెత్తగా, యోగేంద్ర గార్గ్, పిళ్లై, ఇతర బృంద సభ్యులు సమగ్ర వివరణ ద్వారా వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం సందర్శకులు స్థానిక ట్రిపుల్ ఐటీ క్యాంపస్ కు వెళ్లి, అక్కడ విద్యార్థులు, అధ్యాపకులతో సంభాషించారు. అక్కడ విద్యా విధానం, పరిశ్రమతో అనుబంధం తదితర అంశాలపై ఆరా తీసి, తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

# ఏ బి హెల్పింగ్ హాండ్స్ సేవలు ఎంతో అభినందనీయం..

## ఏ బి హెల్పింగ్ హాండ్స్ చలివేంద్రాన్ని ప్రారంభించిన

## ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్

ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 26: ఏ బి హెల్పింగ్ హాండ్స్ సేవలు ఎంతో అభినందనీయమని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు శనివారం ఎస్ఆర్ పురం మండలం పుల్లూరు క్రాస్ రోడ్ జంక్షన్ లో ఎన్నారై డాక్టర్ భాస్కర్ రెడ్డి చందన దంపతులు ఏ బి హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటుచేసిన చలివేంద్రం ని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ ఎస్ ఆర్ పురం మండలంలో ఆటిజం వ్యాధితో పుట్టిన పిల్లలకు ఏ బి హెల్పింగ్ హాండ్స్ ద్వారా ఒక బియ్యం బస్తా 20 రకాల హోమ్ నీడ్స్ అందించడం ఎంతో గర్వించదగ్గ విషయం.. ఎస్ఆర్ పురంమండలంలో 10 కుటుంబాలలో పేదరికంలో ఉన్న పిల్లలను గుర్తించి వారికి సేవ చేయడం ఏబి హెల్పింగ్ హాండ్స్ సేవలను ఎమ్మెల్యే డాక్టర్ థామస్ కొనియాడారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు టిడిపి జిల్లా నాయకుడు



రాజశేఖర్ నాయుడు సాఫ్ట్వేర్ సేతు రెడ్డి టిడిపి యువ నాయకుడు శ్రీకాంత్ రెడ్డి మాజీ ఎంపీటీసీ వేమన నాయుడు పెనుమూరు మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు సూరి రెడ్డి సురేష్ ఉదయ్ కుమార్ మైనారిటీ నాయకుడు మాబు భాష మోహన్ నాయుడు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### స్వచ్ఛ ఆంధ్ర పైలెట్ ప్రాజెక్టుగా....

# రాళ్ళబూదుగురు గ్రామపంచాయతీ!

శాంతీపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 26: కుప్పంనియోజకవర్గం ఆంధ్ర రాష్ట్ర ముఖ్య మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం, శాంతిపురం మండలం లోని అన్ని గ్రామాలను చెత్త రహిత గ్రామా లుగా తీర్చి దిద్దుటలో భాగంగా మండలం లోని రాళ్ళ బూదుగురు గ్రామపంచాయ తీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ప్రభు త్వం ద్వారా ఎలక్ట్రికల్ ఆటోను చెత్త సేక రణ కోసం కేటాయించడం అయిందని శనివారం ఎంపీడీవో తెలిపారు. దీనిద్వారా ఇంటింటి నుండి చెత్త సేకరణ సంబంధిం చిన పనులు మరియు త్వరగా పని పూర్తి చేయుటకు వీలు కలుగుతుంది, మొదటగా ఎలక్ట్రికల్ ఆటో సేవలను రాళ్ళబూదుగు రు గ్రామ పంచాయతీ నందు వినియోగించి ఎలక్ట్రికల్ ఆటో ఉపయోగాలు మరియు ఏమైనా మార్పులు చేయవలసి ఉంటే పై అధికారులకు తెలియజేయాల్సి ఉంది, దీని ద్వారా అన్ని గ్రామ



పంచాయతీలకు ఎలక్ట్రికల్ ఆటోలను సరఫరా చేసి శాంతి పురం మండలంలోని అన్ని గ్రామాలను పరిశుభ్రమైన గ్రామాలుగా మార్పు చెందు తాయని శాంతిపురం మండల ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో (పి ఆర్ & ఆర్ డి) రవి నాయక్ పంచాయతీ కార్య దర్శి స్వాతి,స్థానిక సర్పంచ్ లక్ష్మీ మురు గేష్, స్థానిక ప్రజాప్రతినిధులు ఆర్ఎస్ మనీ,జయరాజు,వాజిద్,గోపి మరియు పలువురు గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉద్యోగుల భద్రతే మాకు ముఖ్యం



శాంతిపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 26: కుప్పంనియోజకవర్గం శాంతిపురం మండ లం మొరసన పల్లి గ్రామంలో ఉండు తిరు మల డైరీ నందు శనివారం ఉద్యోగులకు, డైరీ కార్మికులకు,రసాయనాల వినియోగం మరియు వాహన చోదక సమయంలో భద్రత గురించి ఏరియా మేనేజర్ రాజన్న ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ తమ విధులు నిర్వ ర్తించేటప్పుడు తప్పకుండా భద్రత జాగ్రత్త లు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ మేనేజరు హరి కృష్ణ,మేనేజర్ సురేష్,శివ,నవీన్, రజనీ కాంత్ పాల్గొన్నారు.

## ఇక బడా నేతలే...

తిరుపతి : ఏపీలో కూటమి సర్కార్ దూకుడు పెంచింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు, నేరాలు-ఘోరాలను వెలికితీసేందుకు యాక్షన్ ప్లాన్ ను స్పీడప్ చేసిందని పొలిటికల్ సర్కిల్స్ లో చర్చ నడుస్తోంది. దీంతో కూటమి సర్కార్ కొలువైన దగ్గరి నుంచే వైసీపీ అవినీతి గుట్టలను బద్దలు కొడుతూ ఒక్కో రాయిని పెకిలించి వేస్తోంది. అలా ఇప్పటివరకు అనేక కేసుల్లో ఇరుక్కుకున్న విపక్షానికి చెందిన నేతలను అరెస్ట్ చేస్తూ వస్తున్నారు పోలీసులు. ఏపీలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో మొదలైన అరెస్టుల పర్వం ఇంకా కంటిన్యూగా కొనసాగుతోంది. పిన్నెల్లితో పాటు నందిగం సురేష్, వల్లభనేని వంశీ, పోసాని కృష్ణమురళి, బోరుగడ్డ అనిల్, మాజీ వైసీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ వంటి వారు అరెస్ట్ అయ్యారు. ఇందులో కొందరు ప్రస్తుతం రిమాండ్ లో ఉన్నారు. మరికొందరు మాజీలు అరెస్టు భయంతో కోర్టుల చుటూ తిరుగుతున్నారు. ఇప్పటికే మాజీ మంత్రి విడదల రజినిపై ఉన్న కేసులో ఆమె మరిది గోపిని అరెస్టు చేశారు. అలాగే మాజీ ఇంటిలిజెన్స్ చీఫ్ ఖూఖీ ఆంజనేయులును నటి జత్వాని కేసులో అరెస్టు చేసి రిమాండ్ కి పంపారు పోలీసులు.ఇక లిక్కర్ స్కాం కేసులో ఇప్పటికే కీలక సూత్రధారి అయిన కేసిరెడ్డిని అరెస్ట్ చేసిన సిట్ అధికారులు ఈ కేసులో 8వ నిందితుడిగా ఉనన కేసిరెడ్డి తోడల్లుడు బూనేటి చాణక్యని కూడా అరెస్ట్ చేశారు సిట్ అధికారులు. వసూళ్లు చేసిన కమిషన్ల మొత్తాన్ని చాణక్య?రాజ్ కసిరెడ్డికి అందించేవారని..అక్కడి నుంచి ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ సాయిరెడ్డి, భారతి సిమెంట్స్ లో పనిచేసే బాలాజీ, అలాగే వైఎస్ అనిల్ రెడ్డికు చేరేవని సిట్ విచారణలో తేలిందట. వీరి ద్వారా వివిధ రూపాల్లో కమిషన్లు.. అంతిమంగా అప్పటి సీఎం జగన్‌కు చేరేవని సిట్ విచారణలో తేలిందని సమాచారం.అయితే బూనేటి చాణక్య రిమాండ్ రిపోర్టులో అనేక సంచలన అంశాలు పొందుపరిచారట సిట్ అధికారులు. దాని ప్రకారం..వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 2019 తొలినాళ్లలో హైదరాబాద్‌లోని ఓ హోటల్లో సజ్జల శ్రీధర్ రెడ్డి నేతృత్వంలో ఒక భేటీ జరిగిందట. మద్యం కుంభకోణానికి అక్కడే బీజం పడిందట. ఇక రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం కేసులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డిని గురువారంనాడు సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు.కేసులో 3నెలల క్రితం సబ్ కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్‌ను అరెస్టు చేశారు. మరో నిందితుడైన అప్పటి ఆర్డీవో మురళి ఏసీబీ అదుపులో ఉన్నారు. పెద్దిరెడ్డి అనుచరుడు మాధవరెడ్డి పట్టుబడడంతో త్వరలో మరిన్ని పెద్దతలకాయలను సీఐడీ పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉందని టాక్. పెద్దిరెడ్డితో పాటు ఆయన కుమారుడు, ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన సోదరుడు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకానాథరెడ్డిని అదుపులోకి తీసుకోవచ్చన్న టాక్ రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది.ముఖ్యంగా మాజీ మంత్రి విడదల రజిని, కాకాణి గోవర్ధన్ రెడ్డిలపై కేసులు నమోదు అవ్వడంతో త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేసే అవకాశం ఉందంటూ పొలిటికల్ సర్కిల్స్ లో చర్చ నడుస్తోంది. అలాగే లిక్కర్ స్కాంలో మిథున్ రెడ్డి అరెస్ట్ అయ్యే ఛాన్స్ ఉందని సమాచారం. అయితే ఈ అరెస్ట్‌లతో కూటమి సర్కార్ రాజకీయాలకు..ఓ రకమైన సందేశం ఇస్తుందా అనే చర్చ జరుగుతోంది. ఎందుకంటే ఒకప్పుడు నేతల మధ్య మాటల యుద్ధం అంటే రాజకీయంగా ఉండేది. కొంతకాలంగా రాజకీయమే యుద్ధంగా మారుతోందట. వ్యక్తిగత విషయాలను టార్గెట్ చేస్తూ..వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు కొందరు నేతలు. ఇక వాళ్లు వాడే భాష జుగుప్సాకరం, అసభ్యకరం, అభ్యంతకరంగా ఉందన్నది మరికొందరి అభిప్రాయం. దీంతో సింపథీ వర్కౌట్ కాకపోగా..ఒకరకమైన చర్చ జనాల్లో మొదలవుతోంది.

# కాశ్మీర్ ఉగ్రవాద దాడిలో మృతులకు ఐక్యవేదిక ఆధ్వర్యంలో నివాళులు

పీలేరు,చిత్తూర్ ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 26: అన్నమయ్య జిల్లా పీలేరు, కాశ్మీర్ ఉగ్రవాద దాడిలో మృతులకు ఎం ఆర్ పి ఎస్ అన్నమయ్య జిల్లా సీనియర్ నాయకులు పీలేరు నియోజకవర్గం ఎం ఎస్ పి ఇన్చార్జి గండికోట వెంకటేష్ ఆధ్వర్యంలో శాంతి యుతంగా మైనపువర్తులు వెలిగించి నివా ళులు అర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ, జన సేన, ముస్లిం మైనార్టీ, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సంఘం ఐక్యవేదిక నాయ కులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భం గా పీలేరు పట్టణం బండ్లవంకలో నూతనం గా వెలిసిన శ్రీమాతమ్మ తల్లి ఆలయంలో మృతులకు ఆత్మ శాంతి చేకూరాలని పూజ లు చేసిన అనంతరం కోటపల్లి వివేకానంద సర్కిల్ నందు మృతుల చిత్రపటాల వద్ద కొబ్బరికాయలు కొట్టి మైనపు వత్తులు వెలి గించి మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి కోటపల్లి బాబు రెడ్డి, ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామకృష్ణ మాదిగ, నోబుల్ టీచర్స్ అసో సియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రెడ్డి రమేష్ బాబు, టిడిపి రాష్ట్ర బీసీ సాధికార సమితి కార్యదర్శి పురం రామ్మూర్తి,జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కలప రవి ఎంఎస్పి పీలేరు నియోజకవర్గంలో చార్జి గండుకోట వెంకటేష్ లు మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీకి ఏ వర్గానికి చెందినవారు కాకుండా కేవలం కుటుంబ సభ్యులతో విశ్రాంతి తీసు కుని ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందు కు వెళ్లిన టూరిస్టులపై కాశ్మీర్ ఉగ్రవాదులు విచక్షణార హితంగా కాల్చి చంపడం చాలా దారుణమని ఇటువంటి దారుణానికి వడిగ ట్టిన ముష్కరులను గుర్తించి ఆ దేశానికి తగిన గుణపాఠం తో పాటు ముష్కర్లను కఠినంగా శిక్షించాల న్నారు. భారతదేశంలో హిందూ ముస్లిం భాయి భాయి అనుకుం టూ ప్రశాంత వాతావరణంలో మనుగడ సాగిస్తున్నారని ఇలాంటి ముష్కరుల వల్ల మతకల్లోహాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నా యి, ఇలాంటి వాటిని ఆదిలోనే అంతమొం దించాలని




తెలిపారు.ఈ దాడిని మేము సంయుక్తంగా ఖండిస్తున్నామన్నారు. ఇటు వంటి దాడులు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ట బందోబస్తు ఏర్పా టు చేయాలని తెలియజేశారు ఈ కార్య క్రమంలో టిడిపి నాయకులు శ్రీనాథ్ రెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, జయ చంద్రారెడ్డి, అమ ర్నాథ్ రెడ్డి,మైనారిటీ నాయకులు నల్లారి రియాజ్,చాంద్ భాషా,నల్లారి పై రోజ్, టిడిపి నాయకులు నరేష్ రెడ్డి,మిట్టశివ, గాండ్ల విజయకుమార్,ఎస్టి నాయకులు రమేష్ బాబు,ఎస్సీ నాయకులు కప్పరం చంద్రయ్య,ఎం ఆర్ పి ఎస్,ఎం ఎస్ పి సీనియర్ నాయకులు బండ్ల వంక పివి రమణ,పెద్ద రమణ,తంగేళ్ల రమణ యువ నాయకులు నరసింహ,రాజేష్,నరేష్, ఆనంద,రాము, గంగాధర,హరీష్,అధిక సంఖ్యలో మహిళలు




## ఇది హిందూ ముస్లిం గొడవ కాదు.. పహల్గామ్ ఉగ్రదాడిపై...

# స్పందించిన కాజల్ అగర్వాల్

జమ్ము కశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గాం ప్రాంతంలో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ నరమేధంలో 26 మరణించారు. ఇక ఉగ్రదాడి అనంతరం దేశంలో పరిస్థితులు ఉత్కంఠగా మారిన విషయం తెలిసిందే. అయితే ఘటన అనంతరం పలు ప్రాంతల్లో మత ఘర్షణలు చెలరేగడంతో పాటు సోషల్ మీడియాలో హిందు వర్సెస్ ముస్లింలుగా విడిపోయి.. గొడవలు పెట్టుకుంటున్నారు. తాజాగా ఈ వివాదంపై స్పందించింది నటి కాజల్ అగర్వాల్. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి హిందూ వర్సెస్ ముస్లిం గొడవ కాదని, విద్వేషాలు రెచ్చగొట్టేవారు కోరుకునేది కూడా అదేనని నటి కాజల్ అగర్వాల్ అన్నారు. ఇది ఉగ్రవాదం వర్సెస్ మానవత్వం అని ఆమె స్పష్టం చేశారు. భారతీయులను ఒక ప్రత్యేకమైన వర్గం పేరుతో వేరు చేయవద్దని ఆమె తన సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తి చేశారు. వేర్పాటు భావం భయాన్ని పెంచుతుందని, మరింత వ్యతిరేక భావాలకు దారితీస్తుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. "మనమంతా ఒకే చైతన్యం, ఒకే జాతి" అని కాజల్ అగర్వాల్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## పొలిటికల్ ఎంట్రీ ఇవ్వబోతున్న కమెడీయన్.. ఆశ్చర్యంలో ఫ్యాన్స్



ఇటీవలి కాలంలో చాలా మంది సినీ సెలబ్రిటీలు పొలిటికల్ ఎంట్రీ ఇస్తుండడం మనం చూస్తూనే ఉన్నాం. ఇప్పుడు కమెడీయన్ సునీల్ కూడా పొలిటికల్ ఎంట్రీ ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. ఈ విషయం తెలిసి అందరు అవాక్కవుతున్నారు. వివరాలలోకి వెళితే సునీల్ కమెడీయన్‌గా, హీరోగా అదరగొట్టిన విషయం తెలిసిందే. ఇటీవలి కాలంలో నటుడు సునీల్ సీరియస్ పాత్రలు చేస్తూ మెప్పిస్తున్నాడు. గత ఏడాదే 11 సినిమాలతో ప్రేక్షకులని అలరించాడు. ఈ ఏడాది ఇప్పటికే రెండు సినిమాలతోనూ అలరించాడు. -రామం రాఘవం-, -మ్యాడ్ స్క్వేర్- చిత్రాలతో మెప్పించాడు. కొన్ని కొత్త ప్రాజెక్ట్‌లు కూడా సైన్ చేసినట్టు తెలుస్తుంది. ఇప్పుడు సునీల్ రాజకీయ పాత్రలలోను నటించి మెప్పించడానికి రెడీ అవుతున్నాడు. పొలిటికల్ ఎంట్రీ ఇవ్వబోతున్న సునీల్ అనే టైటిల్ చూసి కాస్త కంగారు పడి ఉండారు. కాని ఆయన రియల్ లైఫ్‌లో కాదు, రీల్ లైఫ్‌లో పొలిటికల్ ఎంట్రీ ఇస్తున్నారు. ఇంతకీ ఏంటా సినిమా? అనేది చూస్తే.. దళపతి విజయ్ కథానాయకుడిగా కోలీవుడ్ లో వినోథ్ దర్శక త్వంలో -జననాయగన్- చిత్రం రూపొందుతుంది. విజయ్ రాజకీయంగా ఎంట్రీ ఇచ్చిన నేపథ్యంలో ఆయన చేస్తున్న తొలి పొలిటికల్ చిత్రం ఇది. రానున్న ఎన్నికలని దృష్టిలో పెట్టుకొని విజయ్ ఈ చిత్రం చేస్తున్నాడు. ఇందులో విజయ్ రాజకీయ నాయకుడి పాత్ర పోషించనుండగా, ఆయనతో పాటు మరికొంత మంది రాజకీయ నాయకుల పాత్రలు పోషిస్తున్నారు. వారంతా తమిళ నటులే. అయితే ఓ తమిళ రాజకీయ నాయకుడి పాత్రలో నటించే అవకాశం సునీల్ కి దక్కడం చర్చనీయాంశంగా మారింది. సునీల్‌ది చిత్రంలో విజయ్‌కి ప్రత్యర్ధి పాత్ర అంటున్నారు. సునీల్ ఆహార్యం, వైట్ అండ్ వైట్ గెటప్ ఇంట్రెస్టింగ్ ఉంటుందంటున్నారు. మరి ఈ ప్రచారంలో నిజమెంత ఉందో తెలియదు కాని ప్రస్తుతం ఈ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. గతంలో ఎప్పుడు సునీల్ ఇలాంటి తరహా పాత్ర పోషించింది లేదు. కోలీవుడ్ లో సునీల్ అరుదైన ఛాన్స్ అందుకుంటున్నాడు.

## ఉగ్రదాడి విషాదం.. కన్సర్ట్‌ను క్యాన్సిల్ చేసిన శ్రేయాఘోషల్

జమ్ము కశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గాం ప్రాంతంలో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ నరమేధంలో 28 మరణించారు. ఇక ఉగ్రదాడి అనంతరం దేశంలో పరిస్థితులు ఉత్కంఠగా మారిన విషయం తెలిసిందే. పలు నగరాల్లో ఇప్పటికే భద్రతను కట్టుదిట్టం చేశారు. అయితే దేశవ్యాప్తంగా ప్రస్తుతం హై అలర్ట్ ఉండడంతో పలువురు సినీ ప్రముఖులు తమ షోలను క్యాన్సిల్ చేసుకుంటున్నారు. ఇప్పటికే సింగర్ అర్జిత్ సింగ్ ఏప్రిల్ 27న చెన్నైలో జరగాల్సిన తన షో రద్దు చేసుకోగా.. తాజాగా సింగర్ శ్రేయాఘోషల్ కూడా తన కన్సర్ట్‌ను రద్దుచేసుకుంది. నేడు గుజరాత్‌లోని సూరత్ వేదికగా శ్రేయాఘోషల్ మ్యూజిక్ కన్సర్ట్ ఉండగా.. తాజాగా ఈ క్యాన్సిల్ చేసుకున్నామని ప్రకటించింది శ్రేయా. ఇప్పటికే షో కోసం టికెట్లు బుక్ చేసుకున్నవారికి డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని వెల్లడించారు. 'ఆల్ హార్ట్స్ టూర్ అనే పేరుతో శ్రేయాఘోషల్ దేశ విదేశాల్లో సంగీత ప్రదర్శనలు ఇస్తున్నారు. ఆమె చెన్నై, కోయంబత్తూరులో ఇప్పటికే ప్రదర్శనలు ఇచ్చారు. ఈరోజు సూరత్‌లో జరగాల్సిన కార్యక్రమం రద్దయింది. మళ్లీ ముంబైలో మే 10న ఆమె షో ఉంటుంది. మరోవైపు, అనిరుధ్ కూడా 'హుకుమ్' పేరుతో ప్రపంచ టూర్ చేస్తున్నారు. మే 31న బెంగళూరులో జరగనున్న ఆయన కాన్సర్ట్ టికెట్లు గంటలోనే అమ్ముడయ్యాయి. ప్రేక్షకుల ఆదరణతో జూన్ 1న కూడా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అయితే, ఉగ్రదాడి కారణంగా రెండో రోజు టికెట్ల అమ్మకాలు వాయిదా పడ్డాయి. కొత్త తేదీని త్వరలో ప్రకటించనున్నారు.



## ఎన్టీఆర్ నీల్ ప్రాజెక్ట్‌లో శృతి హాసన్.!






టాలీవుడ్ అగ్ర కథానాయకుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్, కేజీఎఫ్, సలార్ చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబోలో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. NTRNeel అంటూ రానున్న ఈ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఎన్టీఆర్ 31గా ఈ ప్రాజెక్ట్ రాబోతుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇప్పటికే హైదరాబాద్‌లోని పలు లొకేషన్స్‌లో ప్రశాంత్ నీల్ కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. మరోవైపు మేలో తారక్ కూడా ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొనబోతున్నాడు. మేకర్స్ తారక్‌తో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించబోతున్నట్లు సమాచారం. ఈ సీక్వెన్స్ సినిమాకు చాలా ముఖ్యమైనవని సమాచారం.ఇదిలావుంటే ఈ మూవీకి సంబంధించి ఒక వార్త ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ సినిమాలో శ్రుతి హాసన్ కూడా నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. చిత్ర బృందం ఇప్పటికే ఆమెను సంప్రదించారని, ఆమె కూడా అంగీకరించారని టాక్ వినిపిస్తోంది. సినిమాలో ఒక ప్రత్యేక గీతంలో శ్రుతి హాసన్ నర్తించనుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా, ఆమె కథకు కీలకమైన పాత్రలో కూడా కనిపించవచ్చని తెలుస్తోంది. తారక్ పాత్ర మరియు ఆమె పాత్రల మధ్య ముఖ్యమైన సన్నివేశాలు ఉంటాయని సమాచారం. శ్రుతి హాసన్ గతంలో ఎన్టీఆర్‌తో రామయ్య వస్తావయ్య అనే సినిమాలో చేసింది.

## శివనామ స్మరణతో మోత మోగిపోతున్న టాలీవుడ్.. మేకర్స్‌కి కలిసొచ్చేనా..!

టాలీవుడ్ స్థాయి పెరిగింది. వైవిధ్యమైన చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. డిఫరెంట్ కంటెంట్‌ని ప్రేక్షకులు ఆదరిస్తున్న నేపథ్యంలో మేకర్స్ కూడా కొత్త దనాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే దేవుళ్లపై టాలీవుడ్‌లో చాలా సినిమాలు రూపొందాయి. ముఖ్యంగా శివుడికి సంబంధించిన చిత్రాలు ఎన్నో తెరకెక్కడమే కాకుండా మంచి విజయాలు సాధించాయి. అయితే ట్రెండ్‌కి తగ్గట్టుగా శివయ్యపై సినిమాలు చేస్తున్నారు. ఇటీవలే తమన్నా నటించిన ఓదెల2 చిత్రం శివయ్య ప్రధానంగా రూపొందిన చిత్రమే. అలానే -శివం భజే శివుడు కీలకంగా రూపొందింది. ఈ రెండు ఈ మధ్య కాలంలో రిలీజ్ అయి మంచి ఫలితాలు సాధించాయి. తాజాగా పాన్ ఇండియాలో శివ నామస్మరణ మోగించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. మంచు విష్ణు ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న కన్నప్ప ప్రాజెక్ట్ మంచు ఫ్యామిలీకే డ్రీమ్ ప్రాజెక్ట్ కాగా, ఇది శివుని భక్తుడు కన్నప్ప కథ ఆధారంగా తెరకెక్కింది. గత కొద్ది రోజులుగా ఈ మూవీ తెగ వార్తలలో నిలుస్తుంది. అందుకు కారణం ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, మోహన్ బాబు, మధు ప్రీతి ముకుందన్ లాంటి స్టార్లు కీలక పాత్రలు పోషించడమే. జూన్‌లో ఈ మూవీ విడుదలకి సిద్ధం కాగా, దీనిపై అందరిలో భారీ అంచనాలే ఉన్నాయి. సీజీ పనులు ఆలస్యమవుతోన్న నేపథ్యంలో చిత్ర రిలీజ్ కాస్త వాయిదా వేసి జూన్ 27న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. నందమూరి నటసింహ బాలకృష్ణ నటిస్తోన్న అఖండ2 చిత్రం కూడా శివుని నేపథ్యంలో రూపొందుతుంతుంది. బాలయ్య ప్రధాన పాత్రలో బోయపాటి శ్రీను ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో బాలయ్య అఘోరిపాత్రలో విశ్వరూపం చూపించబోతున్నారు. ప్రత్యేకంగా కుంభమేళా కూడా కలిసి రావడంతో, అక్కడ సన్నివేశాలు సినిమాకు హైలైట్ గా ఉంటాయని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తుంది. అఘోరి పాత్రలో బాలయ్య నట విశ్వరూపం చూపించడం ఖాయం. మరోవైపు సుధీర్ బాబు హీరోగా నటించిన జటాధర కూడా శివుడి కాన్సెప్ట్ ని ఆధారంగానే రూపొందింది. సాయి శ్రీనివాస్ నటిస్తోన్న -హైంధవ, అరవింద్ కృష్ణ నటిస్తోన్న ఎ మాస్టర్ పీస్ శివుడి కథ ఆధారంగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం.







OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036